RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 347 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 08-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

ధర్మమైన బాట ధరణిన వెల్గొందు
కానిమాటవలన హానికలుగు
కత్తిపోటు కన్న కర్మపోటు మనకు
నతిభయంకరము నమ్మునిజము

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# బెంగాల్‌పై కన్నేస్తే..పాక్ ముక్కలే



- 1971 నాటి చరిత్ర పునరావృతమవుతుంది..
- పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి:
- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్
- భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కవ్వింపులు
- కవ్వింపు చర్యలపై రక్షణ మంత్రి ఆగ్రహం.

న్యూఢిల్లీ

పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంరగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. -మిగతా 2 లో



వచ్చే మూడ్రోజులు తెలుగు

## రాష్ట్రాల్లో వర్షాలు

- పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం
- వాతావరణ శాఖ వెల్లడి



హైదరాబాద్,

తెలుగు రాష్ట్రల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు -మిగతా 2 లో



## ఇరాన్ నాగరికత అంతమైపోవడం ఖాయం

- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హర్మ్యాజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్


వాషింగ్టన్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు.మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మ్యాజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యం -మిగతా 2 లో

విజయన్, మోడీ మంచి

# మిత్రులు

రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్



- కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది.
- కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది
- పినరయి విజయన్ అంటే తనకు గౌరవం.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదు
- కేరళ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు

తిరువనంతపురం

:కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. -మిగతా 2 లో

ఐదు రాష్ట్రాల్లో

## ఎగ్జిట్ పోల్స్ నిషేధం

- 9వ తేదీ నుంచి 29 వరకు అమలు
- ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగారశిక్ష లేదా జరిమానా
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల




న్యూఢిల్లీ,

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7.00 గంటల నుండి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూడదని -మిగతా 2 లో

## ఈ యేడు వర్షాలు అంతంత మాత్రమే

- సగటుకన్నా తక్కువ వర్షపాతం నమోదు
- వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడి

2 లో



రాబోయే 48 గంటలు

## బీ కేర్‌ఫుల్..

- ఇరాన్‌లో భారతీయులకు కేంద్రం అలర్ట్



2 లో

## పాకిస్తాన్‌లో 'స్మార్ట్ లాక్‌డౌన్'

- చమురు సంక్షోభంతో కీలక నిర్ణయం




2 లో

## ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ

పరిగిలో భూములు లాక్కునే యత్నం

- 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదు
- రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదు
- సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డ హరీష్ రావు
- పరిగి వెళుతున్న హరీష్ రావు తదితరుల అరెస్ట్
- శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు



హైదరాబాద్,

:పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం -మిగతా 2 లో



తెలంగాణలో మావోయిస్టుల

## శకం ముగిసింది

- కర్రెగట్టుల్లో స్వేచ్ఛగా తిరిగే వెసలుబాటు
- మావోయిస్టు అడ్డాలు అభివృద్ధి పరుగులు
- రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి

ములుగు

తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసిందని డిజిపి శివధర్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు తుపాకుల మోతతో, అశాంతితో నిండిన తెలంగాణ అటవీ ప్రాంతాల్లో ఇప్పుడు శాంతి గీతం వినిపిస్తోంది. దశాబ్దాల కాలంగా మావోయిస్టులకు అడ్డాగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోంది. తెలంగాణలో మావోయిజం పూర్తిగా అంతరించిందని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. 'ఫేస్ టు ఫేస్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కర్రెగుట్టల వంటి మారుమూల ప్రాంతాల్లో మారుతున్న పరిస్థితులను వివరించారు. ఒకప్పుడు దట్టమైన అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ఉనికి ఇప్పుడు -మిగతా 2 లో

## బెంగాల్‌పై కన్నేస్తే..పాక్ ముక్కలే

మొదటి తరువాయి

కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

మొదటి తరువాయి

పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోక పోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు. ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.

## ఇరాన్ నాగరికత అంతమైపోవడం ఖాయం

మొదటి తరువాయి

చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది.ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

## ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ నిషేధం

మొదటి తరువాయి

ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగారశిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి. కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6.00గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సి వుండగా, అస్సాంలో సాయంత్రం 5.00గంటల నుండి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.

## ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ

మొదటి తరువాయి

అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అరెస్టు చేశారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ హరీశ్ రావు అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండంటూ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్నా భూములను ఎందుకు లాక్కుంటున్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ఆయన ప్రశ్నించారు. మీ పాలన అంతా బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా? అని ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రశ్నించారు. రామరాజ్యం వస్తుంది.. కేసీఆర్ రాజ్యం వస్తుందని ఈ సందర్భంగా హరీశ్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. పరిగిలో రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తన్న హరీశ్ రావుతో ఆయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో హరీశ్ రావు పైవిధంగా స్పందించారు. పోలీసు నిర్బంధాలు, అణిచివేత చర్యల మధ్య వికారాబాద్ జిల్లా పరిగి రైతుల వద్దకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు బయల్దేరారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, దివాకర్ రావు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల దయాకర్‌రావుతో కలిసి ఆయన పరిగికి బయల్దేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో అప్పా జంక్షన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు.పరిగికి చేరుకోకుండా హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. హరీశ్‌రావు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా లారీలను రోడ్డుకు అడ్డంగా పెట్టారు. రైతులకు భరోసాగా వెళ్తున్న హరీశ్‌రావును అరెస్టు చేసేందుకు యత్నించారు. అయితే పోలీసుల తీరును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

# విజయన్, మోడీ మంచి మిత్రులు

మొదటి తరువాయి

కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు. కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను




మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరపున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు.

# ఈ యేడు వర్షాలు అంతంత మాత్రమే

**-సగటుకన్నా తక్కువ వర్షపాతం నమోదు**
**-వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడి**

**న్యూఢిల్లీ,**

భారత్‌లో ఈ ఏడాది వర్షాకాలంలో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. నైరుతి రుతువపనాలు కొనసాగే వర్షాకాలం రెండో భాగమైన జూన్-సెప్టెంబర్‌లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల కాలంలో దీర్ఘకాలిక వర్షపాతం సగటున 868.6 మిల్లీమీటర్లు కాగా, అందులో 94 శాతం వర్షాలు మాత్రమే పడే అవకాశాలున్నాయని తెలిపింది.



2026 వర్షాకాలం సీజన్‌లో నమోదయ్యే వర్షపాతం అంచనాలను భారత వాతావరణ శాఖ వచ్చే వారంలో విడుదల చేయనుంది. భారత్‌లో ఏడాదిలో నమోదయ్యే వర్షపాతంలో దాదాపు 70 శాతం వరకూ నైరుతి రుతుపవనాల వల్లే సాధ్యమవుతుంటుంది. నైరుతి రుతుపవనాలు జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ వరి, పత్తి, చెరుకు సహా ఖరీఫ్ పంటల సాగుకు కీలకమవుతాయి. సాధారణంగా జూన్ 1 లేదా మొదటి వారంలో కేరళను రుతుపవనాలు తాకి, జూలై 15 నాటికి ఉత్తరాది సహా దేశమంతటా విస్తరిస్తాయి. కాగా, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ వచ్చే ఈశాన్య రుతుపవనాలు స్వల్పకాలికమే అయినా అగ్నేయ భారతదేశానికి, ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ఈ వర్షాలు కీలకం. శీతాకాలంలో మధ్యధరా ప్రాంతం నుంచి వచ్చే అల్పపీడన వ్యవస్థల కారణంగా తేలిక పాటి నుంచి భారీ వర్షాలు, మంచు కురియడానికి కారణమవుతుంటాయి. అయితే ఈ వర్షాలు ఉత్తరభారతదేశంలో కీలకమైన రబీ పంటలు, ముఖ్యంగా గోధుమలకు చాలా ఉపయోగకరం.

# తెలంగాణలో మావోయిస్టుల శకం ముగిసింది

మొదటి తరువాయి

తెలంగాణలో లేదని డీజీపీ స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ విజయవంతం కావడంతో పాటు, కీలక నాయకత్వం , సైన్యాధ్యక్షులు సైతం బయటకు రావడంతో ఆ వ్యవస్థ పూర్తిగా కొలాప్స్ అయిందని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాలు నక్సల్ రహిత జోన్లుగా మారాయని, ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారని తెలిపారు. గతంలో కనీస సౌకర్యాలు లేకపోవడమే నక్సలిజం పెరగడానికి ప్రధాన కారణమని గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తోంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేని కర్రెగుట్టల వంటి ప్రాంతాలకు ఇప్పుడు బిటి రోడ్ల నిర్మాణం జరుగుతోంది. దీనివల్ల ఆదివాసీలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లడానికి గ్రామస్తుల కోసం ప్రభుత్వం ఒక ఆటో , టూ వీలర్‌ను కమ్యూనిటీ వాహనాలుగా అందజేసింది. గతంలో 12-13 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ఇళ్లకు సోలార్ కందిళ్లను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం చీకట్లను తొలగిస్తోంది. కనీసం ఆధార్ కార్డులు, ఓటు హక్కు వంటి కనీస గుర్తింపు కూడా లేని ఆదివాసీలకు ఇప్పుడు అన్ని ప్రభుత్వ ఫలాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ బాస్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని, అటవీ వనరులను కాపాడుకుంటూనే అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని డీజీపీ భరోసా ఇచ్చారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, అభివృద్ధి ద్వారానే మార్పు సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోంది. కర్రెగుట్టల వంటి ప్రాంతాల్లో వేసిన రోడ్లు కేవలం రవాణా కోసమే కాదు, ఆ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వేసిన బాటలు అని చెప్పవచ్చున్నారు.

## పాకిస్తాన్‌లో 'స్మార్ట్ లాక్‌డౌన్'

**చమురు సంక్షోభంతో కీలక నిర్ణయం**



**న్యూఢిల్లీ,**

ఇరాన్ యుద్ధం ప్రభావం పాకిస్తాన్‌పై గట్టిగా పడుతోంది. హోర్ముజ్ జలసంధి మూసివేయడం, విదేశాల నుంచి చమురు రాకపోవడంతో పాకిస్తాన్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. చమురు కొరత ప్రభావంతో ఇప్పటికే దేశంలో పలు ఆంక్షలు విధించిన పాక్ ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 'స్మార్ట్ లాక్‌డౌన్' విధిస్తూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆదేశాలు జారీ చేశారు. చమురు కొరతపై రాష్ట్రాల సీఎంలతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నాడు.చమురు వినియోగాన్ని తగ్గించేందుకు, ఉన్న నిల్వల్ని కాపాడుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాక్ ప్రధాని చెప్పాడు. 'స్మార్ట్ లాక్‌డౌన్' పై స్థానిక రేడియో వెల్లడించిన వివరాల ప్రకారం.. పాక్‌లోని పంజాబ్, ఖైబర్ పక్తుంఖ్వా, బలూచిస్తాన్, ఇస్లామాబాద్, గిల్గిత్ బల్తిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో పలు ఆంక్షలు విధించారు. మార్కెట్లు, షాపులు, ఇతర కమర్షియల్ స్పేసెస్ అన్నీ రాత్రి ఎనిమిది గంటలకు మూసేయాలి. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మినహాయింపులు ఇచ్చారు. అక్కడ రాత్రి 9 గంటల వరకు అనుమతి ఉంటుంది. జనరల్ స్టోర్స్, డిపార్ట్‌మెంట్ స్టోర్స్ వంటివి ఎనిమిది గంటలకే మూసేయాలి. అలాగే, బేకరీలు, రెస్టారెంట్లు, ఇతర ఫుడ్ ఔట్‌లెట్లు మాత్రం రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచొచ్చు. అలాగే, పెళ్లి వేడుకలపై కూడా ఆంక్షలు విధించారు. రాత్రి 10 గంటల తర్వాత ఇళ్లల్లో మాత్రమే పెళ్లి వేడుకలు తక్కువ మందితో నిర్వహించుకోవాలి. మెడికల్ స్టోర్స్, ఫార్మసీలు మాత్రం ఎల్లప్పుడూ తెరిచి ఉంటాయి. ఈ ఆంక్షలన్నీ మంగళవారం నుంచే అమలు చేయబోతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కొన్ని చోట్ల ప్రైవేటు వాహనాలపై నిషేధం విధించారు. అలాగే, ప్రభుత్వ రవాణా ఉచితంగా అందిస్తున్నారు. నెల రోజులపాటు గిల్గిత్, ముజఫరాబాద్ వంటి చోట్ల ఉచిత ప్రయాణం చేయవచ్చు. హోర్ముజ్ జలసంధి తెరిచి, చమురు అందుబాటులోకి వచ్చే వరకు ఈ పరిస్థితి ఉంటుందని పాక్ అధికార వర్గాలు తెలిపాయి.

## రాబోయే 48 గంటలు బీ కేర్‌ఫుల్..

**ఇరాన్‌లో భారతీయులకు కేంద్రం అలర్ట్**

**న్యూఢిల్లీ,**



ఈ రాత్రి తాము చేయబోయే దాడులతో ఇరాన్ లో నాగరికత ముగిసిపోతుందని, ఈ రాత్రి ప్రపంచ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లో నివసిస్తున్న భారత పౌరుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర హెచ్చరికలు చేసింది. రాబోయే 48 గంటలపాటు భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడివారు అక్కడే ఇళ్లకు పరిమితం కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో ఇరాన్ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ హెచ్చరికలను భారతీయులందరూ తక్షణం పాటించాలని ప్రభుత్వం కోరింది. రాయబార కార్యాలయం జారీచేసిన అలర్ట్‌లో పలుకీలకమైన సూచనలు ఉన్నాయి. 'తదుపరి 48 గంటలపాటు మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి. అనవసరంగా బయటకు రావద్దు. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సైనిక స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి సున్నితమైన ప్రాంతాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. పెద్దపెద్ద బంగళాల్లో ఉండే వారు పైఅంతస్తుల్లో ఉండొద్దు' అని స్పష్టంచేసింది. అత్యవసరంగా రహదారి ప్రయాణాలు చేయాల్సి వస్తే, తప్పనిసరిగా రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే ఎంబసీ ఏర్పాటు చేసిన వసతి గృహాలు, హోటళ్లలో ఉన్నవారు తమ గదులను విడిచి బయటకు వెళ్లవద్దని, అధికారులతో నిరంతరం టచ్‌లో ఉండాలని కోరింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని లేదా ఒప్పందానికి రావాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 7-8 తేదీల్లోగా ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలపై తీవ్ర దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించాడు. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత మొత్తం తుడిచిపెట్టుకుపోతుందని వార్నింగ్ ఇచ్చాడు. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇరాన్‌లో ఉన్న విద్యార్థులు, వ్యాపారులు, యాత్రికులు సహా భారతీయులందరి భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రభుత్వం స్పష్టంచేసింది. అత్యవసర సహాయం కోసం రాయబార కార్యాలయం 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక మొబైల్ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. అలాగే cons.tehran@mea.gov.in ఈ-మెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపింది.

## చించోడులో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



**షాద్‌నగర్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చించోడు గ్రామంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ గ్రామ వీధుల్లో సాగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమతుల్య ఆహారం, వ్యాయామం, పరిశుభ్రత, వ్యసనాలకు దూరంగా ఉండటం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని తెలిపారు. “టుగెదర్ ఫర్ హెల్త్ -- స్టాండ్ విత్ సైన్స్” నినాదంతో ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచారు. విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు “ఆరోగ్యమే మహాభాగ్యం”, “ఆకుకూరలు తిందాం -- రక్తహీనతను నివారిద్దాం” వంటి నినాదాలతో గ్రామం మార్మోగించారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాయికల్ రహదారికి మహర్దశ



**షాద్‌నగర్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాయికల్ నుంచి విట్యాల వరకు 9 కిలోమీటర్ల రహదారిని రూ.12 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం రాయికల్ కమాన్ వద్ద భూమి పూజ చేసి, జెసిబి నడిపి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామేశ్వరం దేవాలయానికి వెళ్లే భక్తులు, స్థానిక ప్రజలు ఇన్నాళ్లుగా ఎదుర్కొన్న ఇబ్బందులకు ఇక ముగింపు లభిస్తుందని తెలిపారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ రైస్ మిల్లుల్లో ధాన్యం కొనుగోళ్లు పునఃప్రారంభం



**మిర్యాలగూడ, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులు--మిల్లర్ల మధ్య వాగ్వాదంతో నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు అధికారుల జోక్యంతో మళ్లీ ప్రారంభమయ్యాయి.ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ రాజశేఖర్ రాజు మిల్లర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి, ట్రాక్టర్లను వెంటనే ఖాళీ చేయించి కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు.రైతులకు మద్దతు ధర అందేలా చూడాలని, ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని అధికారులు సూచించారు. మిల్లర్లు సానుకూలంగా స్పందించడంతో రైతులు నిరసన విరమించి మిల్లుల వద్దకు చేరుకున్నారు.వర్ష సూచన ఉన్న నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం కావడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## ఘనంగా ప్రజానాట్యమండలి 8వ మహాసభలు




**నల్లగొండ, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజానాట్యమండలి నల్లగొండ జిల్లా 8వ మహాసభలు ఘనంగా జరిగాయి. గడియారం సెంటర్ నుండి టీఎస్ యుటిఎఫ్ కార్యాలయం వరకు కళాకారులు భారీ ర్యాలీ నిర్వహించి సాంస్కృతిక ప్రదర్శనలు అందించారు.మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ మాట్లాడుతూ, ప్రజానాట్యమండలి కళను ప్రజా చైతన్యానికి అంకితం చేస్తూ దశాబ్దాలుగా పోరాట ఆయుధంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రపంచీకరణ ప్రభావంతో జానపద కళలు క్షీణిస్తున్నాయని, వాటిని కాపాడటం అత్యవసరమని అన్నారు.కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున గ్రామీణ కళాకారులకు ప్రభుత్వ పథకాలు, పెన్షన్లు, ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలో మినీ రవీంద్రభారతి ఏర్పాటు చేయాలని కోరారు.ఈ మహాసభల్లో రాష్ట్ర, జిల్లా నాయకులు, కళాకారులు, మహిళా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రశాంతంగా జీవశాస్త్రం పరీక్ష - 41 మంది గైర్హాజరు



**నల్లగొండ, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లావ్యాప్తంగా పదో తరగతి జీవశాస్త్రం పరీక్ష మంగళవారం ప్రశాంతంగా ముగిసిందని డీఈఓ బొల్లారం బిక్షపతి తెలిపారు.మొత్తం 106 కేంద్రాల్లో 19,698 మంది సాధారణ విద్యార్థులకు గానూ 19,663 మంది హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 103 మందిలో 97 మంది రాశారు. రెండు విభాగాల్లో కలిపి 41 మంది గైర్హాజరైనట్లు ఆయన వివరించారు.

## విద్యుత్ షాక్‌తో గేదెల మృతి



**నల్లగొండ, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ మండలం జి. చెన్నారం గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన ఘటనలో రెండు పాడి గేదెలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి.గ్రామపంచాయతీ పక్కన ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్ద చెట్లు పెరగడం, మంచు కారణంగా కరెంట్ లీక్ అవడంతో జిల్లపల్లి అంజయ్యకు చెందిన గేదెలు అక్కడికక్కడే చనిపోయాయి.

## అంబేద్కర్ జయంతి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



**దేవరకొండ, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలని, సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 14న దేవరకొండ బస్టాండ్, కొండమల్లేపల్లి కేంద్రంలోని విగ్రహాల వద్ద జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు మద్దిమడుగు భిక్షపతి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం



**ఇబ్రహింపట్నం, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం యాచారం మండల నల్లవెల్లి గ్రామం 10వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రసన, అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్ తులసి ఆధ్వర్యంలో తల్లులకు పోషకాహారం, పిల్లలకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించడం, విద్యా ప్రారంభం చేయడం వంటి కార్యక్రమాలు జరిగాయి.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాజు ఆధ్వర్యంలోని రాజన్న యువసేన విద్యార్థులకు పలకలు, బలపంలు పంపిణీ చేసింది. సూపర్వైజర్ తులసి మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలలో 2.5 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలకు విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నామని, ఆటపాటలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ వెంకటేష్, 10వ వార్డు మెంబర్ మేడిపల్లి వినోద్, అంగన్వాడీ టీచర్లు ఎం. దివ్య, జి. జ్యోతి, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## మూల్యాంకన, కులగణన పారితోషికం తక్షణమే చెల్లించాలి

### -- ఉపాధ్యాయ జేఏసీ





**నల్లగొండ, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్సి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం ఉపాధ్యాయ జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది.గత సంవత్సరం నిర్వహించిన ఎస్ఎస్సి మూల్యాంకన పారితోషికం, 2024 హౌస్‌హోల్డ్ సర్వే కులగణన పారితోషికం ఇప్పటికీ చెల్లించకపోవడంపై ఉపాధ్యాయ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరం పాటు పారితోషికం ఆపడం తగదని, ఎనిమిది సంవత్సరాలుగా ఒక్కో పేపర్‌కు కేవలం పది రూపాయలే చెల్లించడం అన్యాయమని వారు పేర్కొన్నారు.ఇంటర్మీడియట్ మూల్యాంకన పారితోషికం గతంలో 23.66 పైసలు ఉండగా ఇప్పుడు 29.57 పైసలకు పెంచినట్లు గుర్తుచేస్తూ, పదవ తరగతి మూల్యాంకన పారితోషికం కూడా పెంచి వెంటనే చెల్లించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసనలో టీటీ జేఏసీ, యూఎస్పీసీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య శిబిరాలు



**కరీంనగర్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పట్టణం మరియు రూరల్ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్న కార్యక్రమంలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నగరంలోని ఫార్చ్యూన్ మెడికేర్ హాస్పిటల్‌లో లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో భారీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా, పలువురు నగరవాసులు పరీక్షలు చేయించుకున్నారు.రేకుర్తి బేడ బుడగ జంగాల కాలనీలో లయన్స్ క్లబ్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో 120 మందికి ఉచిత షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ననువాల గిరిధర్ రావు ప్రజలకు మితాహారం, వ్యాయామం, వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు.అంబేద్కర్ స్టేడియంలో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించి వాకర్స్, మహిళలు, సీనియర్ సిటిజన్లు, యువకులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాయి.

# గ్రామంలో మౌలిక వసతుల పనులు ప్రారంభం


రాములపల్లె లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్

**ఎలిగేడు, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాములపల్లి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్ తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.10 లక్షలతో కాసర్ల వెంకట్ రెడ్డి ఇంటి నుండి కోట శ్రీను ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ విద్యాలత-విజయ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆరోగ్య అవగాహన ర్యాలీ విజయవంతం


ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారిని డాక్టర్ నిస్సి క్రిస్టిన

**ఎలిగేడు, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సమతుల ఆహారం, దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సింధూర, వినయ్, స్టాఫ్ నర్సులు, సూపర్వైజర్ నాగమణి, ల్యాబ్ టెక్నీషియన్ అఫ్తాబ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గంజాయి నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఏసీపీని కోరిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**మహేశ్వరం, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం, కడ్తల్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్ర గణేష్, అబ్బు రమేష్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఫ్యూచర్ సిటీ ఏసీపీ జానకి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. గ్రామాల్లో గంజాయి బెల్ట్ షాపులు, అక్రమ రవాణా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏసీపీ మాట్లాడుతూ, గంజాయి, మద్యం నివారణకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలు సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తామని తెలిపారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి యువతలో చైతన్యం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో దాసప్ప, కిరణ్, విజేందర్, మహేశ్, ఎర్ర స్వామి, బొల్లెపాక యాదయ్య, ఎర్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** వార్డులోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయమని ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. మంగళవారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నవ చైతన్య కాలనీలో వార్డు ప్రజలతో కలిసి రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులు, రూ. 12 లక్షలతో అండర్ డ్రైనేజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను అధ్యయనం చేశారు. నిత్యం ప్రజల కోసమే జీవిస్తానని, వారి సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో శ్రీను నాయక్ మరియు కాలనీ వాసులు నర్సింహ, రమేష్, నర్సింహ, యాదమ్మ, ఈదయ్య, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# డిండి, ఎస్ ఎల్ బి సి ప్రాజెక్ట్ ద్వారా రైతులకు సాగునీరు





-2028 జూన్ నాటికి ఎస్ ఎల్ బి సి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలి.
-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.

**దేవరకొండ ఏప్రిల్ 07. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండపట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ మరియు రెవెన్యూ శాఖ, ఫారెస్ట్ అధికారులతో ఎమ్మెల్యే బాలు నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవరకొండ నియోజకవర్గంలో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల వేగవంతమైన పూర్తి, భూసేకరణ మరియు రైతులకు పరిహారం చెల్లింపుపై ఎమ్మెల్యే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవరకొండ నియోజకవర్గంలోని పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఇరిగేషన్ రంగంలో అధికారులు, ఇంజనీరింగ్ నిపుణులు, కాంట్రాక్ట్ ఏజెన్సీలు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. "ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి" అని ఆయన అన్నారు. ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అలాగే భూనిర్వాసితులకు తగిన పరిహారం ఆర్ ఢ ఆర్ సకాలంలో అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయానికి నీరందించే ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెండ్లిపాకల రిజర్వాయర్ ముంపు గ్రామాలు గుడితండా, హరిజతండా, పత్యతండా, కారోబార్‌తండా భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రాజెక్టుల ద్వారా ప్రభావితమైన ప్రజల హక్కులు, జీవన ఉపాధి ప్రభుత్వ బాధ్యత అని, భూ నిర్వాసితుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. పెండ్లిపాకల ప్రాజెక్టు కింద భూములు, ఇండ్లు కోల్పోయిన నిర్వాహితులందరికీ పరిహారం, పునరావాసం కల్పించాలి. గాజీనగర్, శాఖవెళ్ళి, నేరేడుగొమ్ము పరిధిలో ఉన్న భూములు మిస్సింగ్ సర్వే నెంబర్ వెంటనే సర్వే చేసి టైటిల్ ఇచ్చి, ప్రభుత్వం నుండి భూ నిర్వహితులకు నష్టపరిహారం చెల్లించాలి. ఈ కార్యక్రమంలో ఎస్సీ బద్రు నాయక్, ఎండిఓ రాజ్ కుమార్, ఆర్డిఓ రమణా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అనంత ప్రతాప్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలా,అరుణ, డి ఎఫ్ఓ సంగీత, శ్రీనివాస్, ఈఈ లు సత్యనారాయణ, రాములు, జాదవ్ యాదవ్,డిఈ లు,రెవెన్యూ, ఇరిగేషన్, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో హెల్త్ క్యాంప్ విజయవంతం



**వెల్దండ, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేజీబీవీ పాఠశాలలో మంగళవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ సింధు విద్యార్థినులకు ఆరోగ్య అవగాహన కల్పించి, హీమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. రక్తహీనత నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రమణకుమార్, డాక్టర్ కవిత, ప్రిన్సిపాల్ శ్రవంతి, పర్యవేక్షకుడు మురళి కృష్ణ, ఫార్మసీ ఆఫీసర్ పుష్ప, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## సిపిఐ ఇంటింటి కార్యక్రమానికి ఆర్థిక సహాయం




**మహేశ్వరం, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం మండల పెద్దపులి నాగారం గ్రామంలో సిపిఐ ఇంటింటి కార్యక్రమం సందర్భంగా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బూర్గుల నవీన్ కుమార్ ఆర్థిక సహాయం అందించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్నాటి యాదయ్య విజ్ఞప్తి చేయగానే వెంటనే స్పందించి విరాళం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యాదయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్. రమేష్, రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర మహాసభ విజయవంతం చేయాలి

దళిత హక్కుల పోరాట సమితి



**ఎలిగేడు, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వరంగల్‌లో ఈ నెల 17న జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర 2వ మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి కవ్వంపల్లి కొండయ్య పిలుపునిచ్చారు. ఎలిగేడు మండల కేంద్రంలో మహాసభ వాల్ పోస్టర్‌ను కోదండరామాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళితుల ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కుల పరిరక్షణ కోసం అందరూ ఏకమై కుల వివక్షత నిర్మూలనకు కృషి చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్సిడీలను బలోపేతం చేసి స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాసంపల్లి కొండయ్య, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి




**ఎలిగేడు, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 14 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు హెచ్పీవీ వ్యాక్సిన్ తప్పక వేయించాలని మండల వైద్యాధికారి నిస్సీ క్రిస్టీనా సూచించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం ఈనెల 9న ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీకా కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. 2011, 2012లో జన్మించిన బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## గొర్ల షెడ్డుకు చెక్కు అందజేసిన సర్పంచ్


చెక్కును అందజేస్తున్న సర్పంచ్ రమాదేవి సంపత్

**ఎలిగేడు, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ర్యాకల్దేవుపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధులతో నిర్మించిన గొర్ల షెడ్డుకు రూ.1,08,900 చెక్కును సర్పంచ్ మద్దెల రమాదేవి-సంపత్లు లబ్ధిదారుడు నలిగేటి సతీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న గొర్ల షెడ్డు పథకాలను గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, డాక్టర్ హరిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మంచాలలో కరెంట్ ఆఫీస్ ముట్టడి

రైతుల సమస్యలపై బీజేపీ ఆందోళన



**మంచాల, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని గ్రామాల్లో కరెంటు సమస్యలు, లో వోల్టేజ్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ మంచాల మండల బీజేపీ ఆధ్వర్యంలో కరెంట్ సబ్‌స్టేషన్ ఎదుట ముట్టడి కార్యక్రమం జరిగింది.మండల అధ్యక్షుడు నుకం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ, "రైతులకు కరెంటు సమస్యలు లేకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత. పంటలు ఎండిపోకుండా, రైతులు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు మారగోని శ్రీశైలం, పండా జంగయ్య, మండల ప్రధాన కార్యదర్శి వెదిరే జగదీశ్వర్ రెడ్డి, గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దశదిన కర్మలో ఉప్పల నివాళి



**ఎల్బీనగర్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగోల్‌లోని పీఎంఆర్ కన్వెన్షన్‌లో చింతపల్లి నరసింహారెడ్డి దశదిన కర్మ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై, నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఆత్మీయంగా ఆదరణ తెలిపారు.ఉప్పల మాట్లాడుతూ, నరసింహారెడ్డి గారు సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మొగుళ్ళ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీగా ఉన్న సిఏ పోస్టు భర్తీ చేయాలని డిమాండ్



**సిరిసిల్ల, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గంభీరావుపేట మండలంలో ఖాళీగా ఉన్న సిఏ పోస్టును వెంటనే భర్తీ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ డిమాండ్ చేశారు.మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో ఆయన మాట్లాడుతూ, నర్మల గ్రామానికి చెందిన మహిళా గ్రూపు సిఏ రాజీనామా చేసి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు కొత్త నియామకం జరగకపోవడం శోచనీయమని అన్నారు. నియామకానికి తేదీలు ప్రకటించి రద్దు చేయడం అనుమానాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు.పరీక్ష నిర్వహించి కూడా నియామకం జరగకపోవడం అధికారుల వైఫల్యమని, అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లోనై జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. అర్హులైన వారిని వెంటనే నియమించకపోతే ఎంఎస్ ఏపీఎం ఆఫీస్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మలేష్ యాదవ్, విగ్నేష్ గౌడ్, ఉపాధ్యక్షులు నర్సింలు, స్వామి, దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు




**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎల్లవేణి శ్రీధర్ అక్రమంగా మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి ట్రాక్టర్‌లో నింపుకొని కరీంనగర్ వైపు రవాణా చేస్తుండగా, బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. ఇంతకుముందు అక్రమ ఇసుక రవాణా చేసి, మరల అదే నేరానికి పాల్పడితే సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని, ట్రాక్టర్లను ఎమ్మార్వో ముందు పూచీకత్తుపై బైండోవర్ చేస్తామని రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# తెలంగాణ జాగృతి నూతన పార్టీ పోస్టర్ ఆవిష్కరణ



**పెద్దపల్లి, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీన ఏర్పాటు చేయబోయే కవితక్క నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి బండారి శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా "సర్వోదయ తెలంగాణ" లక్ష్యంగా ఈ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా తెలంగాణను సంపూర్ణ వికాస దిశగా తీసుకెళ్లడం ఈ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రజలకు నమ్మకం కలిగించే, యువతకు అవకాశాలు కల్పించే, రైతులకు భరోసా ఇచ్చే శక్తిగా ఈ కొత్త పార్టీ అవతరించబోతుందని ఆయన అన్నారు. తెలంగాణ గౌరవం, ఆత్మగౌరవం కాపాడే శక్తిగా కవితక్క నాయకత్వం నిలుస్తుందని, ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా ఈ పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ జాగృతి నాయకులు మంతెన మధు, అమర్, తెలంగాణ యూనివర్సిటీ మలిదశ ఉద్యమ నాయకుడు శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి విద్యార్థి నాయకుడు నరేష్, సుమన్, రాజు, సన్నీ, సునీత, సౌజన్య, రాజేశ్వరీతో పాటు పలువురు విద్యార్థులు, యువ నాయకులు, తెలంగాణ జాగృతి సభ్యులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి అందించిన పోలీసులు




**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మార్చి 1న బొమ్మకల్ గ్రామంలో ఇష్తికర్ అహ్మద్ తన వివో ఫోన్ పోగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ ఫోన్ ఆదిలాబాద్‌లో ఉన్నదని గుర్తించిన పోలీసులు, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు కానిస్టేబుల్ విశ్వతేజ రికవరీ చేశారు.మంగళవారం రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి ఆ ఫోన్‌ను యజమాని ఇష్తికర్ అహ్మద్‌కు అప్పగించారు. ఈ చర్యపై స్థానికులు పోలీసుల కృషిని అభినందించారు.

# పాత ఓటరు వివరాల మ్యాపింగ్‌కు ఎన్నికల కమిషన్ పిలుపు



**కరీంనగర్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మారుతీనగర్ వార్డు కార్యాలయంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. ముఖ్యంగా పాత ఓటరు వివరాలను ప్రస్తుత కార్డుతో అనుసంధానం చేసే ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు. 2002లో లేదా అంతకంటే ముందు ఓటు వేసిన వారు తమ పాత కార్డు వివరాలు లేదా గతంలో ఓటు వేసిన ప్రాంతం వివరాలను బూత్ లెవల్ ఆఫీసర్‌కు తెలియజేసి నమోదు చేసుకోవచ్చు. ప్రస్తుత ఓటు హక్కు ఉన్నవారు తమ తల్లిదండ్రుల వివరాలను వెల్లడించి కూడా మ్యాపింగ్ పూర్తి చేయవచ్చు.ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను సరిచూసుకోవాలని ఎన్నికల నమోదు అధికారి విజ్ఞప్తి చేశారు.

# కేజీబీవీ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం



**వెల్దండ, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.డాక్టర్ సింధు ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థినికి హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రమణకుమార్, డాక్టర్ కవిత, ప్రిన్సిపాల్ శ్రవంతి, హెల్త్ క్యాంపు పర్యవేక్షకుడు మురళి కృష్ణ, ఫార్మసీ ఆఫీసర్ పుష్ప, ఆరోగ్య కార్యకర్తలు అనవరీ బేగం, లక్ష్మి కళ, ఆశా కార్యకర్త పద్మ పాల్గొన్నారు.వైద్యులు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి, రక్తహీనత నివారణకు సరైన ఆహారం, జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి అత్యధిక అవార్డులు




**పెద్దపల్లి, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలోనే అత్యధిక అవార్డులు అందుకున్న పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి మరోసారి విశేష గుర్తింపు పొందింది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా జిల్లా సూపరింటెండెంట్ డా. కొండా శ్రీధర్ పలు అవార్డులు స్వీకరించారు.సూపరింటెండెంట్ కేటగిరీలో బెస్ట్ సూపరింటెండెంట్ ఉ అనస్థటిస్ట్, సివిల్ సర్జన్ అవార్డుతో పాటు, ఆరోగ్యశ్రీ కేసులలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించినందుకు రెండవ అవార్డు, అలాగే టీ-హబ్ ద్వారా అత్యధిక రక్తపరీక్షలు నిర్వహించినందుకు మూడవ అవార్డును అందుకున్నారు. రేడియాలజీ విభాగం తరపున ఎక్కువ స్కానింగ్స్ చేసినందుకు డా. సంధ్యా రాణి కూడా అవార్డుతో సత్కరించబడ్డారు.ఈ విజయాలతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక అవార్డులు అందుకున్న ఆసుపత్రిగా నిలిచింది.

# అంజనీ పుత్ర సంస్థపై స్పష్టీకరణ

**పెద్దపల్లి, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాఘవపూర్‌కు చెందిన తోడేటి సంధ్యకు సంబంధించిన వివాదంలో అంజనీ పుత్ర సంస్థకు ఎలాంటి సంబంధం లేదని సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి ఒక ప్రకటనలో తెలిపారు.వారు పేర్కొన్నదాని ప్రకారం, బాధితులు గతంలో సంస్థలో రూ.8.65 లక్షలతో ప్లాటు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని, ఆ ప్రక్రియకు రెండు సంవత్సరాలు గడిచిందని తెలిపారు. ఇటీవల జరిగిన డబ్బు, బంగారం కాజేసిన ఘటనలో తమ సంస్థ పేరును తోడేటి సంధ్య వాడటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.అంజనీ పుత్ర సంస్థ ప్లాటు విక్రయం, రిజిస్ట్రేషన్ విషయాల్లో ఖచ్చితంగా ఉంటుందని, అక్రమ వసూళ్లకు తమ పేరును వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వృద్ధ దంపతులకు 40 లక్షలు, 7 తులాల బంగారం మేర టోకరా వేసిన ఘటనలో సంధ్యపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.సంస్థ 8 జిల్లాల వరకు విస్తరించి ఉందని, ఎక్కడా వినియోగదారులు ఇబ్బంది పడ్డ దాఖలాలు లేవని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# ఘనంగా నగరపాలక ఏఈ ఆయూబ్ ఖాన్ పదవి విరమణ సన్మానోత్సవం



**కరీంనగర్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగరపాలక సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్‌గా సుదీర్ఘకాలం సేవలందించిన యం.డి. ఆయూబ్ ఖాన్ పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానోత్సవం జరిగింది.కళాభారతి వేదికగా నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఆయూబ్ ఖాన్‌ను శాలువాతో సత్కరించారు.ఈ వేడుకలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస సామీతో పాటు పలువురు నాయకులు, కాంట్రాక్టర్ల సంఘం సభ్యులు పాల్గొని ఆయూబ్ ఖాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# రోడ్లపై అడ్డంగా పార్కింగ్... ప్రజలకు ఇబ్బందులు

**కరీంనగర్, ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ నగరంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో, నియమాలకు విరుద్ధంగా వాహనాలను రోడ్లపైనే పార్క్ చేయడం ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ముఖ్యంగా అంబేద్కర్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తోంది. అంబేద్కర్ స్టేడియం నుండి భగత్‌సింగ్ విగ్రహం వరకు కొంతమంది వాహనదారులు తమ వాహనాలను ఇష్టానుసారంగా రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులకు మాత్రమే కాకుండా, పాదచారులకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా



సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ రద్దీ పెరిగి పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. అంబేద్కర్ స్టేడియంలో నిత్యం వాకింగ్, వ్యాయామం కోసం వచ్చే పెద్దలు, మహిళలు, వాకర్స్, అలాగే సమీప పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ అనియంత్రిత పార్కింగ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై పార్క్ చేసిన వాహనాల వల్ల ప్రమాదాలకు కూడా అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వాలు మారినా... రోడ్లు మారవా? ఇంకా ఎన్నాళ్లు ఎదురు చూపులు!



**కరీంనగర్, ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాలకులు మారుతున్నా, హామీలు మారుతున్నా... ప్రజల సమస్యలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయనే వేదన కరీంనగర్ నగర ప్రజల్లో వెల్లివిరుస్తోంది. ముఖ్యంగా కోతిరాంపూర్ -- గిద్ద పెరుమాండ్ల గుడి నుంచి కట్టరాంపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ కీలక మార్గం పూర్తిగా అస్తవ్యస్తంగా మారి, గుంతలతో నిండిపోయి ప్రయాణికులకు నరకయాతనగా మారింది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతూ, డ్రైనేజీ సమస్యల కారణంగా రోడ్డు మీదే నీరు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో, స్థానిక ప్రజలు వెంటనే నూతన సీసీ రోడ్డు నిర్మించాలని, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అలాగే రోడ్డు ఇరువైపులా హైమాస్ లైట్లు ఏర్పాటు చేసి భద్రతను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన రోడ్లు, డ్రైనేజీ వంటి అంశాలను నిర్లక్ష్యం చేయవద్దని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ నుండి ఇద్దరు కార్యకర్తల సస్పెన్షన్



**గన్నేరువరం, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన ఇద్దరు కార్యకర్తలను సస్పెండ్ చేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి ప్రకటించారు. పారువెల్ల గ్రామానికి చెందిన చెక్కిళ్ల తిరుపతి గౌడ్, బోడ నరసింహారెడ్డి పార్టీకి నష్టం కలిగిస్తున్నారని ఆరోపిస్తూ, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు వీరిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి వారికి కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమం



**గంగాధర, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని వెంకట్రావుపల్లి పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, విద్యా సమీక్ష కేంద్రాల బలోపేతంలో భాగంగా సమీక్షా సమావేశం జరిగింది. విద్యార్థుల చేరికలు, లెర్నింగ్ లెవెల్స్‌పై చర్చ జరిపి, స్టూడెంట్ డేటాబేస్‌లో సమాచారాన్ని డిజిటల్ రూపంలో నమోదు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాధనాల ద్వారా డిజిటల్ అక్షరాస్యత బోధన చేపట్టి, ఏఎక్స్ఎల్, జి కాంప్రమైజ్,కోడ్ మిత్ర,ఎడ్యుకేటివ్ 8 యాప్, అసిస్టెంట్ మ్యాథ్స్ టూల్స్, లాంగ్వేజ్ టూల్స్ ఉపయోగించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు కరుణాకర్, శ్యామదత్తు, గీత, రవీందర్, ఆంజనేయులు, శ్రీలత పాల్గొన్నారు. విద్యా సమీక్ష కేంద్రాల బలోపేతంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం పాఠశాల మెరుగుదలకు దోహదం చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## ఓట్ల గల్లంతుపై జనసేన విమర్శలు



**కరీంనగర్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఓటరు జాబితాలో బతికున్నవారి ఓట్లు తొలగించబడటం, మరణించినవారి ఓట్లు యథాతథంగా ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని జనసేన పార్టీ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. డివిజన్ల మ్యాపింగ్ పేరుతో జరుగుతున్న సర్వే లోపభూయిష్టంగా ఉందని, బూత్ లెవెల్ ఆఫీసర్లు గడప గడపకు తిరగకుండా స్థానిక కార్పొరేటర్ల కనుసన్నుల్లో తప్పుడు నివేదికలు తయారు చేయడం వల్లే ఓట్లు గల్లంతు అవుతున్నాయని ఆయన ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ముందు వందల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించకపోవడం వల్లే పోలింగ్ శాతం తగ్గిందని, దీనికి జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ బాధ్యులని పేర్కొన్నారు. ఒక ఇంటిలోని ఓట్లు పలు డివిజన్లలో నమోదు కావడం, డబుల్ ఓట్లు రావడం, పేరు ఒకటి--ఫోటో మరొకటి ఉండటం వంటి తప్పులు అధికారుల సమన్వయ లోపంతోనే జరిగాయని అన్నారు. దొంగ ఓట్లకు చెక్ పెట్టేందుకు ఆధార్ కార్డును ఓటరు కార్డుతో లింక్ చేసే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిబంధనను కఠినతరం చేయాలని, లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బేతి మహేందర్ రెడ్డి హెచ్చరించారు.

## 14వ వార్డులో స్వచ్ఛతపై అవగాహన సదస్సు



**హుస్నాబాద్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ పురపాలక సంఘం 14వ వార్డులో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. చైర్‌పర్సన్ దండి లక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చెత్త విభజన, హోమ్ కంపోస్టింగ్, ప్లాస్టిక్ బ్యాన్ వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026 ప్రకారం చెత్తను తడి, పొడి, సానిటరీ, హానికరమైన చెత్తగా నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. డ్రైనేజీలలో చెత్త వేయరాదని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలని, ప్లాస్టిక్‌కు బదులుగా మెప్మా ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని కూడా ప్రజలకు వివరించారు. అనంతరం డ్రైనేజీల వెంట స్ప్రేయింగ్, బ్లీచింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, వార్డ్ ఆఫీసర్లు శేఖర్, శ్రీకాంత్, ఆర్పీ అరుణ, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సిపిఐ పార్టీ బలోపేతంకై సభ్యత్వం పూర్తి చేయాలని పిలుపు



**కరీంనగర్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

సిపిఐ పార్టీని బలోపేతం చేయడం కోసం త్వరితగతిన సభ్యత్వాన్ని పూర్తి చేసి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతియేటా పునరుద్ధరించే సభ్యత్వాన్ని విస్తృతంగా చేర్పించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని సూచించారు. కొత్త సభ్యులకు సైద్ధాంతిక అవగాహన కల్పించి, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులపై ఒత్తిడి తేవాలని సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో పొనగంటి కేదారి, అందె స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షల రెమ్యునరేషన్ విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్




**కరీంనగర్, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

పదవ తరగతి పరీక్షల మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. కరీంనగర్‌లోని సెయింట్ జాన్ స్కూల్ ఎదురుగా టీటీజేఏసీ, యుఎస్పిసి, జాక్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. 2024 అక్టోబరులో కుల గణనలో పనిచేసిన ఉపాధ్యాయులకు కూడా ఇప్పటివరకు రెమ్యునరేషన్ చెల్లించలేదని, వెంటనే విడుదల చేయాలని కోరారు. స్పెషల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు టిఏ, డిఏ మంజూరు చేయాలని, స్పాట్ రెమ్యునరేషన్‌ను 50% పెంచాలని సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఊకంటి విజేందర్ రెడ్డి, గడప శేఖర్, కరుణాకర్ రెడ్డి, పిన్నింటి తిరుపతిరావు, నే ఊరి కరుణాకర్‌తో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి వద్ద వినతి పత్రం సమర్పించారు.

# జనాభా లెక్కలపై తహసీల్దార్ పరిశీలన



**ఎలిగేడు, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాములపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జనాభా లెక్కల నిర్వహణపై తహసీల్దార్ యాకయ్య మంగళవారం పరిశీలించారు.గ్రామాన్ని రెండు బ్లాకులుగా విభజించి సర్వే సిద్ధం చేశారు. సర్వే విధానంపై సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

# డీసీఎం కింద పడి వ్యక్తి మృతి



**దేవరకొండ ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ పట్టణంలో స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది.దేవరకొండ మండలంలోని బుడ్డ తండకు చెందిన మూడావత్ రమేష్ (30) అనే వ్యక్తి ఎండాకాలం కావడంతో తీవ్రంగా అలిసిపోయి చల్లదనం కోసం మైదానంలోని ఒక చెట్టు కింద నిద్రపోయాడు, అయితే అదే సమయంలో అక్కడికి వచ్చిన ఒక డీసీఎం వాహన డ్రైవర్ చెట్టు కింద పడుకున్న రమేష్‌ను గమనించకుండా అజాగ్రత్తగా బండిని అతనిపైకి ఎక్కించాడు.ఈ ప్రమాదంలో రమేష్ కు తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందడని ఎస్ఐ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజలందరికీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు



**దేవరకొండ ఏప్రిల్ 07.(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ డెప్యూటీ బ్రాంచ్ మేనేజర్ గుండు సురేష్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న వైద్య ఖర్చుల దృష్ట్యా ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనుకోని ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండాలంటే ముందస్తుగా హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం మేలని ఆయన సూచించారు. నల్గొండలోని క్లాక్ టవర్ వద్ద గల సెంట్రల్ బిజినెస్ సెంటర్‌లో తమ కార్యాలయం అందుబాటులో ఉందని, తక్కువ ప్రీమియంతో మెరుగైన వైద్య సేవలు పొందేలా ప్లాన్లు ఉన్నాయని ఆయన వివరించారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన కోరారు.


# యాచారం మండల కమిటీని ప్రకటించిన బీజేపీ

**యాచారం ఏప్రిల్ 07.(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బిజెపి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం రోజు పూర్తి స్థాయి మండల కమిటీని ప్రకటించారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ నూతన కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజల్లో పార్టీ పట్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను గెలిపించుకునే దిశగా సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌లో వైభవంగా ఎల్లమ్మ బోనాలు




ఎల్లమ్మ బోనాలతో గౌడ కులస్తుల మహిళలు.



డప్పు చప్పుడుతో ఎల్లమ్మ బోనాలు నిర్వహిస్తున్న గౌడ కులస్తులు

**ఎలిగేడు, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో మంగళవారం రాత్రి ఎల్లమ్మ బోనాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.గ్రామంలోని దాదాపు 30 కుటుంబాల మహిళలు తలపై బోనాలను ఎత్తుకుని, బైండ్ల పూజారులు డప్పు, చప్పుళ్లతో ఊరంతా ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.బుధవారం శ్రీరేణుక ఎల్లమ్మ--జమదగ్ని కళ్యాణం, పట్నం వంటి కార్యక్రమాలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్రాడ్, గౌడ సంఘం అధ్యక్షులు పల్లెర్ల వెంకటయ్య గౌడ్, ఉపాధ్యక్షులు బుర్ర సదానందం గౌడ్, కార్యవర్గ సభ్యులు కాటం అంజయ్య గౌడ్, పల్లెర్ల మొగిలి గౌడ్, గౌడ సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్‌ను కలిసిన గోలీ శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లను హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, రాష్ట్రంలో ఆహార భద్రత, పీడీఎస్ అమలు, నాణ్యమైన సరఫరాపై చర్చించారు.రేషన్ దుకాణాల్లో పారదర్శకత, డిజిటల్ విధానాల అమలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల లోపాలు, తాగునీటి సమస్యలు, రహదారులు, విద్య, వైద్య రంగాల అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడాలని, గ్రామీణ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, భారతి పాల్గొన్నారు.

# ఆమనగల్లులో అసిస్టెంట్ లేబర్ కార్యాలయం ఏర్పాటుకు వినతి



**ఆమనగల్లు, ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆమనగల్లు పట్టణ కేంద్రంలో లేబర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని తెలంగాణ కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి లను ఆ సంఘం నిర్మాణ కార్మికులు కోరారు. ఈ మేరకు నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటనకు వెళ్తున్న మహేష్ కుమార్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. మాడుగుల, ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల కార్మికులు కార్డులు, క్లెయిమ్‌ల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, రోజువారీ కూలి నష్టం, ప్రయాణ ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లు పట్టణ కేంద్రంలో అసిస్టెంట్ లేబర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక ఉపాధ్యక్షులు మహమ్మద్ జహంగీర్, కార్మిక ముఖ్య సలహాదారుడు ముక్కెరి కృష్ణయ్య, పులికంటి మైసయ్య, మల్లేష్, లక్ష్మీనారాయణ, దావా నర్సింహా, రామచంద్రయ్య, జంతుక అశోక్ తదితరులు ఉన్నారు.

# మైసమ్మ తల్లిని దర్శించుకున్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**ఆమనగల్లు, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని ప్రసిద్ధ మైసిగండి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తి వాతావరణం నెలకొంది.టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సిడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అభిషేకం, అర్చన, హారతి కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు రాష్ట్ర ప్రజల శాంతి, సుభిక్షం కోసం ప్రార్ధనలు చేశారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ గీత నర్సింహా ముదిరాజ్, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, గుర్రం కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, లక్పతి నాయక్, హీరా సింగ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.నాయకుల రాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారి, భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహం కనిపించింది. స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఘన స్వాగతం పలికారు. నాయకులు భక్తులతో కలసి కొంతసేపు గడిపి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మైసిగండి మైసమ్మ ఆలయం ప్రాంతీయంగా ఎంతో ప్రాచుర్యం పొందిన దేవస్థానం కాగా, ప్రత్యేక రోజుల్లో వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు.

# సంతాపూర్‌లో విషాదం

**- బావిలో పడి కుమారుడు మృతి, మనస్థాపంతో తండ్రి ఆత్మహత్య**



**కేశంపేట, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంతాపూర్ గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది.హజీపల్లి గ్రామానికి చెందిన తూర్పాటి యాదయ్య (40) తన కుటుంబంతో రఫీక్ వ్యవసాయ పొలంలో కూలీ పనులు చేస్తూ నివసిస్తున్నాడు. ఏప్రిల్ 4న అతని కుమారుడు కన్నయ్య (11) కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు 5వ తేదీన మిస్సింగ్ కేసు నమోదు చేశారు.కుమారుడు కనిపించకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన యాదయ్య, 6వ తేదీ మధ్యాహ్నం అదే బావిలో దూకి ప్రాణాలు తీసుకున్నాడు. అనంతరం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి, బావిలో తండ్రి, కుమారుడు మృతదేహాలను వెలికితీశారు.ప్రాథమిక విచారణలో బాలుడు ప్రమాదవశాత్తూ బావిలో పడిపోయినట్లు, ఆ సంఘటనతో మనస్థాపానికి గురైన తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై కేశంపేట పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 70/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రజలు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ నరహరి, ఎస్ఐ రాజకుమార్ సూచించారు.

# ఆస్తి కోసం హత్య

**- రిమాండ్‌కు ఆరుగురు నిందితులు**



**కల్వకుర్తి, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి పట్టణంలో ఆస్తి వివాదం కారణంగా పగతో హత్య చేసిన ఘటనలో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సై రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఈ నెల నాలుగో తేదీన వెల్దండ మండలంలోని పోతేపల్లి రోడ్డులో టిప్పర్‌తో కావాలని ఢీకొట్టి, అనంతరం బండరాయితో తలపై మోది రుద్రాక్షల మహేష్ (27)ను హత్య చేసినట్లు విచారణలో తేలింది. మృతుడు భార్య మేఘన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వెల్దండ పోలీసులు చాకచక్యంగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.నిందితులు అన్వేష్ (20), మనుపటి శివ (22), మనుపటి పవన్ (25), వెంకటమ్మ (45), రుద్రాక్షల కృష్ణయ్య (50), ఎండి బురాన్ (45)లను తిమ్మరాశిపల్లి గ్రామంలోని షెడ్డు దగ్గర పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఆస్తి, పందుల పెంపకం వివాదాల కారణంగా పక్కా ప్రణాళికతో హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. టిప్పర్ డ్రైవర్ బురాన్‌కు రూ.2 లక్షలు ఇచ్చినట్లు కూడా వెల్లడైంది.నిందితులలో ముగ్గురిపై గతంలో కేసులు ఉండగా, వీరిపై రౌడీషీట్ నమోదు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన వెల్దండ సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘువీర్ రెడ్డి, ఎస్సై కురుమూర్తి, కానిస్టేబుళ్లు కిషోర్ రెడ్డి, ఆంజనేయులు, కౌసల్య, నవీన్‌లను జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ అభినందించారు.

## గాజాలో 8 వేల మందికిపైగా చిన్నారులు గల్లంతు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** 2023 అక్టోబర్ 7న ప్రారంభమైన పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడుల వల్ల లక్షలాది మంది మరణించారు. 29 నెలలపాటు జరిగిన ఇజ్రాయిల్ దాడుల వల్ల గాజాలో 21,510 మంది మృతి చెందారు. ఇప్పటికీ 8 వేల మంది చిన్నారులు ఆచూకీ లేరు. బాంబుల దాడికి కూలిపోయిన భవనాల శిథిలాల కింద 2,100 మంది చిక్కుకుపోయారని తాజాగా పాలస్తీనా కేంద్రం వెల్లడించింది. వేలాది మంది చిన్నారులు అదృశ్యమవ్వడంపై పాలస్తీనా ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో వివిధ ప్రాంతాల్లో సుమారు 200 మంది మైనర్లు ఆచూకీ లేకుండా అదృశ్యమయ్యారు. ఇజ్రాయిల్ దాడుల వల్లే వారు గల్లంతయ్యారని అనుమానాలున్నాయని పాలస్తీనా కేంద్రం నివేదించింది. ఇజ్రాయిల్ దాడులకు గురైన అత్యంత ప్రభావితమైన ప్రాంతంలోనూ, మానవతా సహాయం కోసం ఎదురుచూసే ప్రదేశాల్లోనూ, ఆహారం కోసం వెతుకున్నప్పుడు గానీ పిల్లలు అదృశమయ్యారని పాలస్తీనా కేంద్రం నివేదిక వివరించింది.

## హెుర్ముజ్‌పై యూఎన్ తీర్మానాన్ని వీటో చేసిన రష్యా, చైనా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** హెుర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడమే లక్ష్యంగా ఐక్యరాజ్యసమి భద్రతా మండలి ప్రతిపాదించిన తీర్మానాన్ని రష్యా, చైనా వీటో చేశాయి. రెండు దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉంటాయని ఆశతో పదేపదే సవరించిన తీర్మానాన్ని యూఎన్ మంగళవారం ఓటింగ్‌కు ప్రవేశపెట్టింది. తీర్మానానికి అనుకూలంగా 11, వ్యతిరేకంగా 2 ఓట్లు పడగా రెండు దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువు ముగియడానికి కొన్ని గంటల ముందు ఈ ఓటింగ్ జరిగింది. ఒకవేళ ఆ తీర్మానం ఆమోదం పొందినప్పటికీ ఇప్పుడు ఐదవ వారంలోకి ప్రవేశించిన యుద్ధంపై అది ప్రభావం చూపి ఉండేదో లేదో సందేహమే. రష్యా, చైనా తీర్మానాన్ని వీటో చేసే బదులు ఓటింగ్‌కు దూరంగా ఉండేలా చేయడానికి దాన్ని గణనీయంగా బలహీనపరిచినప్పటికీ ఫలితం దక్కలేదు

## యుద్ధంవల్ల పశ్చిమాసియాకు 10 వేల విమాన సర్వీసులు రద్దు : కేంద్రం వెల్లడి




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అయితే ఈ ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి భారత విమానయాన సంస్థలు పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తూ వస్తున్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం భారత్ నుంచి పశ్చిమాసియాకు మొత్తం 10 వేల విమాన సర్వీసులు రద్దయినట్లు పౌరవిమానయాన శాఖ వెల్లడించింది. యుద్ధానికి ముందు భారత్ నుంచి పశ్చిమాసియాకు రోజుకు 300 నుంచి 350 వరకు విమాన సర్వీసులు నడిచేవి. ఘర్షణల కారణంగా ఆ సంఖ్య ఇప్పుడు 80-90కి పడిపోయిందని పౌరవిమానయాన శాఖ తెలిపింది. ఇదిలావుంటే సుదూర విమాన ప్రయాణాలకు సంబంధించి పైలట్ల 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్' ను డీజీసీఏ తాత్కాలికంగా సడలించింది. విమాన కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకునేందుకే డీజీసీఏ ఈ నిర్ణయం తీసుకుందని ఏవియేషన్ మినిస్ట్రీ వెల్లడించింది.

## నిర్దిష్ట కమ్యూనిటీ ఓటర్లను తొలగించిన కేంద్రం :మమతా బెనర్జీ

**కోల్‌కతా :ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎస్ఐఆర్ పేరుతో కేంద్రం నిర్దిష్ట వర్గానికి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించారని పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నదియా జిల్లాలోని చక్దాహ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో కేంద్రం ఉద్దేశ్యపూర్వకంగా నిర్దిష్ట వర్గానికి చెందిన ఓటర్ల పేర్లను తొలగించిందని అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించబడిన ఓటర్లకు టిఎంసి అండగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం ఓటర్ల జాబితా నుండి సుమారు 91లక్షల పేర్లను తొలగించినట్లు ఎన్నికల కమిషన్ తాజా నివేదిక తెలిపింది. అయితే సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. తీర్పు అనంతరం సుమారు 60 లక్షల పేర్లలో 32 లక్షల పేర్లను తిరిగి చేర్చినట్లు మమతా బెనర్జీ తెలిపారు.



# టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు ఘన స్వాగతం





**ఆమనగల్లు, ఏప్రిల్ 7 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గ సమావేశానికి వెళుతున్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, సిడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలను ఆమనగల్లు మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు, ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించాలని సూచించారు. కష్టపడుతున్న కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటామని, వారి సేవలను గుర్తించి భవిష్యత్తులో తగిన పదవులు, పోస్టులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ మండ్లి రాములు, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మెకానిక్ బాబా, కొవ్వూరు శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ నాయక్, అంజన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కాలే మల్లయ్య, సురేష్ నాయక్, రాగ్య నాయక్, రఫీ, పూసలి సత్యం, ఎంగలి ప్రసాద్, పులికంటి మైసయ్య, పరమేష్, రాజేందర్, కృష్ణ యాదవ్, జగదీష్, కొండల్ రెడ్డి, రవి, కుమార్ గౌడ్, శేఖర్ గౌడ్, రామకృష్ణ, అంజత్, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా జడ్జిని కలిసిన నూతన కార్యవర్గం





**ఆమనగల్లు, ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రెండవసారి అధ్యక్షునిగా ఎన్నికైన అండేకార్ యాదిలాల్ బార్ అసోసియేషన్ న్యాయవాదులతో కలిసి రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఘనంగా సత్కరించారు. ఆమనగల్లులో నూతన కోర్టు భవన నిర్మాణం గురించి వివరించి, సీనియర్ కోర్టు షాద్ నగర్ నుండి మహేశ్వరం రావాలని కోరినట్లు వారు తెలిపారు. అదేవిధంగా ఆమనగల్లులో కోర్టు భవనం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని ఎమ్మార్వో ఫహీం ఖాద్రి ను కలిసి వినతి అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఆయన వెంట న్యాయవాదులు సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, ఉపాధ్యక్షులు శేఖర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శి మధు గౌడ్, కోశాధికారి మల్లేష్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, సర్దార్ నాయక్ న్యాయవాదులు రామకృష్ణ, మల్లేష్, జగన్ గౌడ్, మధు గౌడ్, ప్రభు నాయక్, మహేశ్వర్, శ్రీశైలం, మహేష్ తదితరులున్నారు.

# ఎల్‌డిఎఫ్ విజయం తథ్యం

**-ప్రజల మద్దతు మాకే..**
**-2021 ఎన్నికల కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుంటాం**
**-వివిధ స్థాయిల్లో యుడిఎఫ్‌ను ప్రజలు తిరస్కరించారు**
**-బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు ఖాళీ చేతులే**
**-కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 07 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** : కేరళలో ఈ నెల 9న జరగనున్న ఎన్నికలు నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఎల్‌డిఎఫ్ విజయం పట్ల ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. దశాబ్దకాలంగా అధికారంలో ఉన్నప్పటికీ సిపిఎం నేతృత్వంలోని కూటమికి ప్రజల మద్దతు కొనసాగుతోందని ఆయన అన్నారు. కేరళలోని కన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పినరయి విజయన్ మాట్లాడారు. ప్రజలతో తాను ఇటీవల జరిపిన సంభాషణల ఆధారంగా మొత్తమ్మీద ప్రజల వాతావరణం లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు అనుకూలంగానే ఉందని పేర్కొన్నారు. 'ఇక్కడి ప్రజలతో మా సంభాషణల ద్వారా మాకు అర్థమైన విషయం ఏమిటంటే, కేరళ ప్రజల మనస్తత్వం ఎల్‌డిఎఫ్‌తోనే ఉంది' అని అన్నారు. 'వివిధ స్థాయిల్లో యుడిఎఫ్‌ను తిరస్కరించారు' అని పేర్కొన్నారు. ఎల్‌డిఎఫ్ విజయంపై ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2021 ఎన్నికల కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుని, మరింత బలమైన ప్రజాదరణతో ఎల్‌డిఎఫ్ తిరిగి అధికారంలోకి వస్తుందని విజయన్ అన్నారు. రాష్ట్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ఖాళీ చేతులతో నిండిపోతుందని కూడా ఆయన పేర్కొన్నారు. కేరళలో సిపిఎం-బిజెపి మధ్య అవగాహన ఉందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల పినరయి విజయన్ తీవ్రంగా స్పందించారు. ఆ ఆరోపణను తోసి పుచ్చుతూ 'ఆయన కొన్ని నిరాధారమైన ఆరోపణలు చేశారు. జవాబుదారీతనంతో మాట్లాడి ఉండాల్సింది' అని హితవు పలికారు. కాంగ్రెస్ రాజకీయ విధానాన్ని ప్రశ్నిస్తూ, అరవింద్ కేజ్రీవాల్ వంటి నాయకుల పట్ల ఆ పార్టీ వైఖరిని విజయన్ ప్రస్తావించారు. 'తమ ప్రత్యర్థిని ఓడించాలనే ఆత్రుతలో.. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ వ్యవహరించిన తీరు చివరికి బిజెపికి సహాయపడింది' అని అన్నారు. అవినీతి ఆరోపణలపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సిబిఐ అరెస్టు చేసినప్పుడు కాంగ్రెస్ అండగా నిలవలేదని, బిజెపి చర్యలకు మద్దతు ఇచ్చిందని విమర్శించారు. 'అది బిజెపికి సమర్థవంతమైన మద్దతు కాదా?' అని ఆయన ప్రశ్నించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల్లో పాల్గోనందుకు కేరళలోని కాంగ్రెస్‌ను కూడా పినరయి విజయన్ విమర్శించారు. 'మేము నిరసనలు నిర్వహించిన ప్పుడు... కాంగ్రెస్, యుడిఎఫ్ నాయకులను ఆహ్వానించాం. కానీ వారు పాల్గొనేందుకు నిరాకరించారు' అని ఆయన గుర్తుచేశారు. ఇలాంటి సమస్యలు 'కేవలం ఎల్‌డిఎఫ్‌కు మాత్రమే సంబంధించినవి కావు. ఇది కేరళ ఉమ్మడి సమస్య. కేరళకు కేంద్రం సృష్టించిన ఒక్క సమస్యకు వ్యతిరేకంగా కూడా కాంగ్రెస్ పోరాటం చేయలేదు' అని ఆయన విమర్శించారు.

శబరిమల మహిళల ప్రవేశం విషయంలో, జాగ్రత్తతో కూడిన, సంప్రదింపుల వైఖరిని అవలంబిస్తామన్న విషయాన్ని పినరయి విజయన్ పునరుద్ఘాటించారు. 'ఇలాంటి విషయాలు తలెత్తినప్పుడు -- ముఖ్యంగా అవి ఆచారాలు, సంప్రదాయాలకు సంబంధించినవి అయినప్పుడు -- పరిగణనలోకి తీసుకోవాల్సిన కొన్ని షరతులు ఉంటాయి' అని అన్నారు. ఏకపక్ష నిర్ణయాలకు బదులుగా 'పండితులు, సామాజిక సంస్కర్తలు' చర్చలలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

ఫిరాయింపులను ప్రస్తావిస్తూ 'బిజెపి ఎంపిలలో సుమారు 30 శాతం మంది కాంగ్రెస్ నుంచి వచ్చినవారే' అని ఆయన పేర్కొన్నారు. ఇది పార్టీలోని వైరుధ్యాలనే ప్రతిబింబిస్తోందని సూచించారు. వరద నిర్వహణలో తమ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని అన్నారు. అందుకు నిపుణుల పరిశోధనలు స్పష్టంగా ఉన్నాయని అన్నారు. 'ఇది మానవ జోక్యం వల్ల సంభవించలేదు. పూర్తిగా ప్రకృతి వైపరీత్యాల వల్లే జరిగింది' అని ఆయన చెప్పారు. అంబలప్పుజ నుంచి యుడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీనియర్ నాయకుడు జి సుధాకరన్, సిపిఎం మహిళా నాయకురాలిపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అటువంటి వ్యాఖ్యలు 'ఒక బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడు చేయకూడనివి' అని, కాంగ్రెస్‌తో చేతులు కలిపిన తరువాత ప్రమాణాలు పడిపోవడాన్ని అవి ప్రతిబింబిస్తున్నాయని ఆయన అన్నారు.